ఫార్మ్‌డీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 8: ఓయూ పరిధిలోని ఫార్మ్‌డీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేండ్ల ఫార్మ్‌డీ మూడో ఏడాది, ఆరేండ్ల ఫార్మ్‌డీ ఆరో సంవత్సరం మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 16 లోగా చెల్లించాలన్నారు. మూడేండ్ల ఫార్మ్‌డీ మొదటి, రెండో సంవత్సరం, ఆరేండ్ల ఫార్మ్‌డీ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సంవత్సరం మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 21వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచ్‌లర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 22 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రీ పీహెచ్‌డీ ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఫ్యాకల్టీల పరిధిలోని అన్ని విభాగాల ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

బొల్లారం, ఆగస్టు 8: కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని టీచర్స్‌కాలనీ, చిన్నకమేళా బస్తీలో గురువారం బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, భిక్షపతి రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్/అమీర్‌పేట్, ఆగస్టు 8: పేద, బడుగువర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగిం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అర్హులైన ప్రతిఒకరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా బీఆర్ఎస్ శ్రేణులు అందుబాటులో ఉంటూ పని చేయాలని సూచించారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే తలసాని మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సనత్‌నగర్‌కు చెందిన 6గురికి షాదీముబారక్ పథకం కింత మంజూరైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన వారు అర్హులై ఉండి కూడా అవగాహన లేక పథకాలకు దూరమవుతున్న వారిని గుర్తించి ఆయా పథకాల ద్వారా లబ్ధిపొందేలా చూడాలని తలసాని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మితో పాటు బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, జమీర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు షాదీముబారక్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న డిప్యూటీ మేయర్

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తార్నాక డివిజన్‌కు చెందిన లబ్ధిదారులకు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతో మేలని అన్నారు. ఆపదలో అండగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

స్వచ్ఛదనం, పచ్చదనంలో పాల్గొన్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట, ఆగస్టు 8: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి గురువారం తుకారాంగేట్ కొండారెడ్డి పార్కు వద్ద నాలా పూడికతీత పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో నాలాల నుంచి వెలువడిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఆమె అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం, పచ్చదనంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వేణు, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, పెండెం మనోహర్, సత్తయ్యగౌడ్, దాసరి శ్రీనివాస్, దేవయ్య, శ్రీరాములు, రమ పాల్గొన్నారు.

గురువారం మెట్టుగూడలో నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ రాసూరి సునీత రమేశ్, తదితరులు. – అడ్డగుట్ట

బల్కంపేట ఎల్లమ్మవారిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి గురువారం దర్శించుకున్నారు. అంతకుముందు ఆమెకు దేవాలయ పాలక మండలి పూర్వ సభ్యులు బీఆర్ నారాయణరాజు, సురేశ్‌గౌడ్‌లతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాస్‌గౌడ్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందుజేసి ఆశీర్వచనాలు పలికారు. - అమీర్‌పేట్

కిడ్నాపర్ అరెస్టు.. తల్లి ఒడికి చిన్నారి

మారేడ్‌పల్లి, ఆగస్టు 8: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో కిడ్నాప్‌నకు గురైన ఐదేండ్ల బాలికను రైల్వే పోలీసులు చేరదీసి తల్లి అప్పగించారు. కిడ్నాపర్‌నను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వెల్లడించారు. జగద్గిరి గుట్ట ప్రాంతానికి చెందిన జావిద్, ఎండీ గౌసియాబేగం దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ నెల 6న సాయంత్రం గౌసియా బేగం తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని జనగాంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం నంబర్ -1లో కుమార్తెలతో కలిసి కూర్చోంది. రాత్రి 8.30 గంటల సమయంలో స్టేషన్ బయట నుంచి భోజనం తీసుకువచ్చేందుకు తల్లి గౌసియా బేగం పెద్ద కుమార్తెనువెంట తీసుకొని వెళ్లింది. ఐదేండ్ల చిన్న కుమార్తె నైరాబేగంను మరుగు దొడ్ల వద్ద కూర్చోబెట్టి వెళ్లింది. భోజనం తీసుకొని వచ్చి చూడగా.. చిన్న కుమార్తె కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో 7న గౌసియా బేగం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. రైల్వే స్టేషన్ గేట్ నంబర్ 1 నుంచి కిడ్నాపర్ బాలికను తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. బాలిక, కిడ్నాపర్ మెహిదీపట్నం బస్టాండ్ సమీపంలో ఉన్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. నిందితుడు పర్వేజ్ (35) మణికొండలో ఉంటూ ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి ఒంటరిగా కూర్చున్న బాలిక నైరాబేగం తీసుకొని మెహిదీపట్నం వెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి.. డబ్బుల కోసం నిందితుడు డిమాండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు అతడిని పట్టుకున్నారు. బాలికను క్షేమంగా తల్లికి అప్పగించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్. జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 8: విద్యార్థులు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడం ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు పొందవచ్చని పలువురు అధ్యాపకులు సూచించారు. సంబంధిత రంగంలో జ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సైతం అందిపుచ్చుకోవాలని అన్నారు. ఓయూ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎఫ్ఆర్‌డీ) భవనంలోని ఈ-క్లాస్ రూంలో విద్యార్థులకు 'ఎంప్లాయబిలిటీ స్కిల్స్'పై ఉచిత శిక్షణను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి.మురళీధర్ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ వీరసోమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి శిక్షణ ఎంతో మేలు చేస్తుందని అన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ఏబీవీపీ నూతన కమిటీ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 8: ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ఏబీవీపీ నూతన కమిటీని గురువారం ప్రకటించారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా సంపత్‌కుమార్, కార్యదర్శిగా రాహుల్, ఉపాధ్యక్షురాలిగా శృతి, సంయుక్త కార్యదర్శులుగా అక్షయ, పూజితలతో పాటు 30 మందితో కూడిన కమిటీని ప్రకటించారు. ముఖ్యఅతిథిగా ఏబీవీపీ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్ హాజరయ్యారు. నూతన కమిటీ సభ్యులు ఏబీవీపీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు విద్యారంగ సమస్యలపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు కమల్ సురేశ్, రాజు, స్టేట్ ఆవిష్కార్ కన్వీనర్ తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఇన్ ఎడ్యుకేషన్ ప్రదర్శన

బేగంపేట్, ఆగస్టు 8: ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బీఎడ్ కళాశాలలో రంగోళి ప్రదర్శన నిర్వహించారు. సామాజిక నేపథ్యంలో విద్యార్థులు ముగ్గులు వేశారు. ఆడపిల్లలను రక్షించాలని, సోషల్ మీడియా ప్రభావం, పర్యావరణ పరిరక్షణ, భిన్నత్వంలో ఏకత్వం, లింగ సమానత్వం, స్వచ్ఛభారత్ అంశాలపై అవగాహన కల్పించేలా ముగ్గులను ప్రదర్శించారు. సెయింట్ మేరీస్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఫాదర్ అంథోని మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యాన్ని క్రోడీకరించి సంస్కృతిని ప్రతి బింబించేలా వేసిన ముగ్గులు ఎంతో ఆలోచింప చేసే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ పుష్ప తదితరులు పాల్గొన్నారు.

దుర్వా గణపతి అలంకరణ

శ్రావణ శుద్ధ చవితి పురస్కరించుకొని సనత్‌నగర్ హనుమాన్ ఆలయ ఆవరణలోని వినాయక ఆలయంలో స్వామి వారికి గురువారం దుర్వా గణపతి పూజ వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి జరుగుతున్న విశేష పూజల్లో భాగంగా స్వామి వారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్ నేతృత్వంలో అర్చకులు స్వామి వారికి గరికలతో చేసిన దుర్వా గణపతి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. – అమీర్‌పేట్

విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన జీయర్ స్వామి

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

బొల్లారం, ఆగస్టు 8: విద్యతో పాటు వినయం ఉంటే జీవితంలో స్థిరపడుతామని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి అన్నారు. గురువారం బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గిరిజన పిల్లలకు ఎంతో ప్రతిభ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ ప్రాజెక్టు అధికారి చందన సర్వే, గిరిజన అభివృద్ధి అధికారిణి కోటాజీ, ప్రధానోపాధ్యాయుడు బానోతు లాలు, వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

● మొక్కలు పంపిణీ చేసిన పలువురు

సికింద్రాబాద్, ఆగస్టు 8: మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత స్థానికులపై ఉందని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు. గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ హేమ స్వచ్ఛదనం, పచ్చదనంలో పాల్గొన్నారు. టీఆర్టీ క్వాటర్స్ పార్కులో మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పచ్చటి మొక్కలు నాటడమంటే భవిష్యత్తు తరాలకు మంచి భరోసాను ఇవ్వడమేనని అన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు, ఏఈ కౌశిక్, వార్డు కార్యాలయ ఇన్‌చార్జి సంధ్య, సీఓ ధనశ్రీ, హార్టికల్చర్ ఇన్‌చార్జి సురేశ్, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు శేఖర్, అశ్విన్, రాజేశ్, బాలాజీ, లక్ష్మి, లలిత, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి టీఆర్టీ పార్కులో మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమ, తదితరులు

తార్నాక డివిజన్‌లో

ఉస్మానియా యూనివర్సిటీ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని తార్నాక డివిజన్‌లో గురువారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని గొల్ల పుల్లయ్య బావి, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి, పరిశుభ్రత, పచ్చదనం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నూర్ మహమ్మదీయ మసీదు సమీపంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎలిజబెత్, ఏఎంసీ ఒమర్, శానిటేషన్ జవాన్ రాజు, సూపర్‌వైజర్ చందు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు కృషి

అడ్డగుట్ట: పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కాసర్ల వీరు అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా ఆయన అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది, ఆశావర్కర్లతో కలిసి ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలను నాటారు. అనంతరం ఆసుపత్రి పరిసరాల్లో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులు దాడాపుగా ధరిచేరవని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

అమీర్‌పేట్: స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో బీకేగూడ జయభారతి స్కూల్ సమీపంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏఎంసీ కైలాశ్‌చంద్ శ్రీవాస్తవ, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ, సిబ్బంది ప్రభాకర్, మానయ్యలతో పాటు నాయకులు ఆకుల మహేశ్, డి.అనంతరెడ్డి, శ్రీకాంత్‌గుప్తా పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బేగంపేట్: పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడాలని బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య సూచించారు. స్వచ్ఛదనం, పచ్చదనంలో భాగంగా ప్రకాశ్‌నగర్‌లో డీసీ సమ్మయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం కాలనీ, బస్తీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు. డీసీ మాట్లాడుతూ కాలనీల్లో పారిశుధ్య, దోమల, చెత్త సమస్యలుంటే జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో బేగంపేట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సుదం, అరుణ్, శేఖర్, గోవింద్‌తో శానిటేషన్, ఎంటమాలజి సిబ్బంది పాల్గొన్నారు.

బీకేగూడ సమీపంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఆరోగ్య కేంద్రంలో శ్రమదానం చేస్తున్న డాక్టర్ కాసర్ల వీరు


బౌద్ధనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్, సిబ్బంది

ప్రకాశ్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న సర్కిల్ అధికారులు

స్పాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 8: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు హబ్సిగూడ స్ట్రీట్ నంబర్-8లోని రాయల్ స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. నలుగురు యువతులు, ఒక విటుడు పట్టుబడ్డారు. యువతులను తార్నాకలోని హోంకు తరలించగా, విటుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు అప్పజెప్పారు. స్పా నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, ఆగస్టు 8: గుర్తుతెలియని యువకుడు రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం 8:25 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి తనకు తానుగా రైలు కింద తల పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి జేబులో దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు కోకాపేట వద్ద ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడని గుర్తించారు. మానసిక ఒత్తిడికిలోనై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసుల విచారణలో వెల్లడించారు. మృతదేహాన్ని గాంధీ మార్చూరీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో..

రైలు బోగి స్ప్రింగుల్లో గుర్తుతెలియని వ్యక్తి తల భాగం ఇరుక్కొని రావడంతో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మౌలాలి సమీపంలోని ఎన్ఎఫ్‌సీ యార్డుకు 1:40 గంటలకు దానాపూర్ స్పెషల్ రైలు వచ్చింది. హెచ్ఎ1 ఏసీ బోగి స్ప్రింగుల్లో వ్యక్తి తల ఇరుక్కుపోవడాన్ని గుర్తించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. రైలు ప్రమాద సమయంలో శరీరం నుంచి తల వేరుపడి ఉండొచ్చని పోలీసులు అనుమానంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.